# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 29.07.2025 | 24 క్యారెట్లు 9,993.00 | కిలో వెండి 1,26,000 | 30 °C | సంపుటి:3 | సంచిక:211

www.vishalabharati.com




## సర్పంచ్ ఎన్నికలకు బ్రేక్..!

**స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్లు కొలిక్కి వచ్చే వరకు వాయిదా పడే అవకాశం**

- కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధర్నా
- రాష్ట్రపతి, ప్రధానితో పాటు ఇండియా కూటమి మద్దతు కోరనున్నారు
- ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో విస్తృతంగా చర్చ
- బీసీ నాయకులు సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు
- ఎన్నికలు ఆలస్యమైతే నిధుల విడుదలలో ఇబ్బందులు వస్తాయని ఆందోళన
- తదుపరి కార్యాచరణ ఎలా ఉండాలనే దానిపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించి

2 లో



## స్పష్టి కేసులో వెలుగులోకి సంచలన విషయాలు

- సంచలనం సృష్టించిన సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ కేసు
- పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి
- - ఈ కేంద్రంలో టెస్ట్ ట్యూబ్ బేబీ (ఐవీఎఫ్) పద్ధతి జరగలేదని తేలింది
- - వేరొకరికి పుట్టిన బిడ్డలను తీసుకొచ్చి అద్దె గర్భం ద్వారా పుట్టారని నమ్మిస్తున్నారు
- డాక్టర్ నమ్రత దంపతుల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు
- బిడ్డల అక్రమ రవాణా చైల్డ్ ట్రాఫికింగ్ అని పోలీసులు పేర్కొన్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ కేసులో పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. అసలు ఈ కేంద్రంలో

మిగతా 2 లో



## తెలంగాణలో కాంగ్రెస్
# మరో పాదయాత్ర

**కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది**

- మీనాక్షి నటరాజన్ ఆరు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నారు
- ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించడమే లక్ష్యంగా ఈ యాత్ర
- జూలై 31 నుంచి ఏడు రోజుల పాటు జిల్లాల్లో పాదయాత్ర కొనసాగుతుంది
- పాదయాత్రకు సంబంధించి రూట్ మ్యాప్ కూడా సిద్ధమైంది
- తొలి దఫాలో పరిగి, అందోల్, ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట సెగ్మెంట్లలో పర్యటిస్తారు

2 లో

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం, ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసేందుకు, నేతల మధ్య సమన్వయం కుదిర్చేందుకు ఆమె కృషి చేయనున్నారు. జూలై 31 నుంచి ఏడు రోజుల పాటు జిల్లాల్లో పాదయాత్ర కొనసాగుతుంది.



## ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం: కేటీఆర్

- కేసీఆర్ పాలనలో ప్రతి చేనుకూ నీళ్లు.. రేవంత్ సర్కార్‌లో ప్రతీ పల్లెకూ మద్యం
- హస్తం పాలనలో ఇంటింటికీ మద్యం అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్
- మద్యం ప్రియుల బలహీనత రాష్ట్ర ఖజానా ఆదాయ వనరుగా మారింది
- గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ
- తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారు
- రేవంత్ హయాంలో పాలన గాలికి ప్రగతి కాటికి అన్నట్లు మారింది

2 లో



## జమ్మూకశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్.. ముగ్గురు
# ఉగ్రవాదులు మృతి

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** జమ్మూకశ్మీర్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతబలగాలు మట్టుబెట్టాయి. శ్రీనగర్‌లోని పర్వత ప్రాంతాల్లో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ముష్కరులను బలగాలు హతమార్చినట్లు చినార్ కోర్ వెల్లడించింది. ఇందులో ఒకరు గతేడాది సోనామార్గ్ సొరంగం వద్ద ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదిగా గుర్తించారు. మరొకరు పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి

మిగతా 2 లో

- శ్రీనగర్‌లోని పర్వత ప్రాంతాల్లో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు
- ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతబలగాలు మట్టుబెట్టాయి
- ముగ్గురు ముష్కరులను హతమార్చినట్లు చినార్ కోర్ వెల్లడించింది
- ఒకరు గతేడాది సోనామార్గ్ సొరంగం వద్ద ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదిగా గుర్తించారు
- మరొకరు పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్ షాహ



## శ్రావణ మాసంలో
# కళ్యాణ వైభోగమే..!

- శ్రావణమాసం ప్రారంభమైంది.. పెళ్లి సందడి మొదలైంది
- మూఢం, ఆషాడమాసం కారణంగా దాదాపు 48 రోజులుగా పెళ్లిళ్లు లేవు
- దీంతో కళ్యాణ మండపాల మీద ఆధారపడిన జీవితాలు వెలవెల పోయాయి
- ఇక వస్త్ర దుకాణాల లోను, జువెలరీ షాప్ లలోను పెద్దగా కొనుగోలు లేవు
- శ్రావణమాసం ప్రారంభం కావడంతో తెలుగు రాష్ట్రాలలో సందడి మొదలైంది
- ఈనెల 26వ తేదీ నుంచి వివాహాలకు మంచి ముహూర్తాలు ప్రారంభం
- ఆగస్టు 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు చాలా బలమైన ముహూర్తాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** శ్రావణమాసం ప్రారంభమైంది. తెలుగు రాష్ట్రాలలో పెళ్లి సందడి మొదలైంది. మూఢం, ఆషాడమాసం కారణంగా దాదాపు 48 రోజులుగా

మిగతా 4 లో

## హైదరాబాద్‌లో 5 రైల్వేస్టేషన్లకు
# కొత్త రూపురేఖలు



- భారతీయ రైల్వే ప్రగతి పథంలో దూసుకుపోతుంది
- మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి కీలక నిర్ణయాలు
- అనేక పథకాలతో ప్రయాణికుల మన్ననలు చూరగొంటుంది
- అమృత భారత స్టేషన్స్ స్కీం కింద అనేక రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు
- రైల్వే వీటి అభివృద్ధి కోసం 170. 61 కోట్ల రూపాయలను కేటాయించింది
- హఫీజ్ పేట, హైటెక్ సిటీ, మలక్పేట, మల్కాజ్గిరి, ఉప్పుగూడ రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు

2 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం
29.07.2025
హైదరాబాద్

epaper.vishalabharati.com
www.vishalabharati.com





- కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది
- మీనాక్షి నటరాజన్ ఆరు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నారు
- ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించడమే లక్ష్యంగా ఈ యాత్ర

# సర్పంచ్ ఎన్నికలకు బ్రేక్..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్లు కొలిక్కి వచ్చే వరకు వాయిదా పడే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్లపై కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేయనున్నారు. రాష్ట్రపతి, ప్రధానితో పాటు ఇండియా కూటమి మద్దతు కోరనున్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం అన్ని పార్టీల బీసీ నాయకులు సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఎన్నికలు ఆలస్యమైతే నిధుల విడుదలలో ఇబ్బందులు వస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.




తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర సందిగ్ధత నెలకొంది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ విషయంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇది ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో ఒక ప్రముఖమైన పరిణామంగా కనిపిస్తోంది.

**కేంద్ర వైఖరిపై ఢిల్లీలో భారీ ధర్నా..**
బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఢిల్లీలో భారీ ధర్నా చేయాలని తెలంగాణ ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో.. ఆగస్టు 5వ తేదీన మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి పయనం కానున్నారు. అక్కడ వారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. అంతేకాకుండా.. బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇండియా కూటమిలోని ఇతర పార్టీల మద్దతును కూడా కోరనున్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర అసెంబ్లీలో ఇప్పటికే ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లు ప్రస్తుతం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. మరోవైపు, రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు ఇచ్చిన గడువు కూడా పూర్తైంది. ఈ నేపథ్యంలో.. తదుపరి కార్యాచరణ ఎలా ఉండాలనే దానిపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించి ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

**రాజకీయ పార్టీలకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు..**
కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ సహా రాష్ట్రంలోని అన్ని పార్టీలలోని బీసీ నాయకులు అందరూ బీసీ రిజర్వేషన్ల కోసం ముందుకు వచ్చి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే అంశంపై ఆగస్టు 5, 6, 7వ తేదీలలో ఢిల్లీలో నిరసన తెలుపుతామని, తమతో కలిసి రావాలని అన్ని పార్టీల బీసీ నాయకులను ఆహ్వానించారు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా రాష్ట్రంలో కుల గణన చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమైతే, వాటికి అందాల్సిన నిధుల విడుదలలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణ హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 2025 చివరి నాటి నిర్వహించాలని, రిజర్వేషన్ ను ఈ నెలాఖరు నాటికి ఖరారు చేయాలని ఆదేశించింది. అయితే, బీసీ రిజర్వేషన్ బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల, రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. రిజర్వేషన్ ఖరారుపై హైకోర్టు గడువు సమీపించిన సమయంలో ఈ బిల్లులకు చట్టబద్ధత కల్పించడానికి ఢిల్లీలో ఒత్తిడి తెచ్చేందుకు ఈ ధర్నా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. బిల్లు చాలా కాలంగా కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్నా.. ఎందుకు ఆమోదింపచేయలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ నేతల్ని ప్రశ్నించారు. ధర్నాలు చేయడానికి తమతో కలిసి రావాలన్నారు. ధర్నాల కోసం మిత్రపక్షాలన్నింటితో కలిసి వెళ్తామన్నారు. బీజేపీ నేతలు..బీసీ రిజర్వేషన్లతో రాజకీయాలు చేయవద్దన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ మరో పాదయాత్ర

- జూలై 31 నుంచి ఏడు రోజుల పాటు జిల్లాల్లో పాదయాత్ర కొనసాగుతుంది
- పాదయాత్రకు సంబంధించి రూట్ మ్యాప్ కూడా సిద్ధమైంది
- తొలి దఫాలో పరిగి, అందోల్, ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట సెగ్మెంట్లలో పర్యటిస్తారు

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ మరోసారి పాదయాత్ర చేసేందుకు సిద్ధమైంది. సార్వత్రిక ఎన్నికల ముందు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర పేరుతో తెలంగాణ రాష్ట్రంలో పర్యటించి పార్టీని గెలిపించుకున్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర తర్వాత కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నారు. మీనాక్షి నటరాజన్ పాదయాత్రకు సంబంధించి రూట్ మ్యాప్ కూడా సిద్ధమైంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకే ఈ పాదయాత్ర ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రజలతో మమేకం అవుతూ శ్రమదానం కూడా ఆమె చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది.
స్థానిక సంస్థల ఎన్నికల నగారా కూడా త్వరలోనే మోగనుండటంతో.. పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసే దిశగా మీనాక్షి నటరాజన్ ప్రణాళికలు రచిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ నేతల మధ్య సమన్వయం నెలకొల్పేందుకు ఆమె కృషి చేయనున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును ఆమె స్వయంగా అడిగి తెలుసుకోనున్నారు. రాష్ట్రంలో 15 రోజులు పాటు ఉండనున్న ఆమె.. జూలై 29న పీసీసీ చీఫ్‌తో సమావేశం కానున్నారు.
ఈ నెల 31 నుంచి ఏడు రోజుల పాటు జిల్లాల్లో ఆమె పాదయాత్ర మొదలవ్వనుంది. పరిగి సెగ్మెంట్ నుంచి పాదయాత్ర ప్రారంభించనున్న ఆమె తొలి దఫాలో పరిగి, అందోల్, ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట సెగ్మెంట్లలో పర్యటిస్తారు. ప్రతి ఉమ్మడి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో పాదయాత్రతో పాటు రాత్రి బస కూడా ఏర్పాటు చేయాలని ఆమె భావిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలలో పాదయాత్ర చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.
ఒకవైపు పాదయాత్రలు చేస్తూనే మరోవైపు జిల్లాల పార్టీ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీటింగ్ కూడా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగానే ముందుగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో రేపు సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వన్ టు వన్ మీటింగ్ నిర్వహించి.. రాష్ట్రంలోని పాలన, గ్రూపు రాజకీయాలపై సమాచారం తెలుసుకోనున్నారు.

# జమ్మూకశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్.. ముగ్గురు ఉగ్రవాదులు మృతి



(మొదటి పేజీ తరువాయి)
సులేమాన్ సాహా అలియాస్ హాషీం ముషాగా అధికారులు వెల్లడించారు.
హర్వాన్ ప్రాంతంలో పహల్గాం ఉగ్రదాడిలో ఉగ్రవాదులు ఉపయోగించిన పరికరాలు వంటి అనుమానాస్పద కమ్యూనికేషన్లను బలగాలు గుర్తించాయి. వెంటనే అక్కడి చేరుకున్న బలగాలు ఆపరేషన్ మహదేవ్ పేరుతో సెర్చ్ ఆపరేషన్‌ను చేపట్టాయి. ఈ క్రమంలో 24 రాష్ట్రీయ రైఫిల్స్, 4 పారా కమాండోల బృందాలు ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించాయి. భద్రతా దళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఆ ముగ్గురిని బలగాలు అంతమ్మొందించాయి.
మృతి చెందిన ఉగ్రవాదుల్లో ఒకరు గతేడాది అక్టోబర్‌లో సోనామార్గ్ సొరంగం వద్ద జరిగిన ఉగ్రదాడిలో పాల్గొన్న జిబ్రాన్‌గా గుర్తించారు. నాటి దాడిలో వైద్యుడు సహా మొత్తం ఏడుగురు అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఘటనాస్థలంలో ఒక %వీ%4 కార్బైన్ రైఫిల్, రెండు %ూఖ% రైఫిల్స్‌తో పాటు పలు ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.
ఆపరేషన్ మహదేవ్ పేరుతో జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టింది. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల సమాచారంతో నెల రోజుల నుంచి గాలింపు చేపట్టారు. చివరకు సోమవారం ఉదయం దాచిగమ్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతుండగా, భద్రతా దళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపగా ముగ్గురు హతమయ్యారు. మృతిచెందిన ముగ్గురూ విదేశీ ఉగ్రవాదులని, లష్కరే తయిబాకు చెందిన వారని సమాచారం. అంతకుముందు పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ ఆపరేషన్ చేపట్టామని, మరణించిన ఉగ్రవాదులు ఆ దాడికి పాల్పడిన వారిగానే తెలుస్తోందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే, దీనిపై సైన్యం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.
కాగా, ఏప్రిల్ 22వ తేదీన జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యటక ప్రాంతమైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడ్డారు. పర్యటకులపై అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తిను పొట్టనపెట్టుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటి నుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్కు చెందిన ఉగ్రవాదులు తామే దాడికి పాల్పడినట్లు ప్రకటించారు. ఆ తర్వాత తమ ప్రకటనను వెనక్కి తీసుకున్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం: కేటీఆర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
కేసీఆర్ పాలనలో ప్రతి చేనుకూ నీళ్లు అందిస్తే.. రేవంత్ సర్కార్‌లో ప్రతీ పల్లెకూ మద్యాన్ని అందిస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ.. ఇప్పుడు అదే మద్యం ద్వారా వచ్చిన ఆదాయం గడిస్తుందని ఎద్దేవా చేశారు. తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తూ.. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానా ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర జరుగుతోందని ట్వీట్ చేశారు. అన్ని రంగాల్లో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి.. ఇప్పుడు ఆదాయం కోసం మద్యం అమ్మకాలను కాంగ్రెస్ సర్కార్ నమ్ముకుందంటూ కేటీఆర్ అన్నారు. ఏడాది కిందట ఒక వ్యక్తి మద్యం కోసం రూ. 897 ఖర్చు చేస్తే.. ఏడాదిన్నర కాంగ్రెస్ హయాంలో అది సగటను రూ. 1,623కు పెరిగిందంటూ విమర్శించారు. రేవంత్ హయాంలో పాలన గాలికి.. ప్రగతి కాటికి అన్నట్లు మారిందంటూ ఆయన ఎద్దేవా చేశారు.



"నాడు కేసీఆర్ పాలనలో పల్లె పల్లెకు ప్రగతి రథచక్రాలు, ప్రతి చేనుకు నీళ్లు ప్రతి చేతికి పని. ఇంటింటికీ తాగునీళ్లు, ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నేడు పల్లె పల్లెలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర. అన్ని రంగాల్లో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి, ఇప్పుడు తీరిగ్గా ఆదాయం కోసం మద్యం అమ్మకాలను నమ్ముకున్న అసమర్థ కాంగ్రెస్ సర్కార్. ఏడాది కిందట సగటున ఒక వ్యక్తి మద్యం కోసం చేసే ఖర్చు రూ. 897, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సగటున ఒక వ్యక్తి మద్యం మీద చేస్తున్న ఖర్చు రూ. 1623కు పెరిగింది. లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచి, దరఖాస్తు ధర రూ. 3 లక్షలకు పెంచాలని నిర్ణయం. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం.. పాలన గాలికి ప్రగతి కాటికి. జాగో తెలంగాణ జాగో" అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.
రాష్ట్రంలోని ఎక్సైజ్ విధానంలో కాంగ్రెస్ పార్టీ కొత్త విధానాలు తీసుకురాబోతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో ముందస్తు నోటిఫికేషన్ జారీ చేయాలంటూ ఇప్పటికే ఎక్సైజ్ శాఖకు కూడా ఆదేశాలు అందాయి. మండల పరిధిలో తక్కువ అమ్మకాలు ఉన్న వైన్స్ షాపులు గుర్తించి వాటిని గ్రామ స్థాయికి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏ4 దుకాణాలకు ప్రభుత్వం రెండేళ్లు ఉన్న లైసెన్స్ గడవును మూడేళ్లకు పెంచేలా ఎక్సైజ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# హైదరాబాద్‌లో 5 రైల్వేస్టేషన్లకు కొత్త రూపురేఖలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
భారతీయ రైల్వే ప్రగతి పథంలో దూసుకుపోతుంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి కీలక నిర్ణయాలు తీసుకొని, అనేక పథకాలతో ప్రయాణికుల మన్ననలు చూరగొంటుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో అమృత భారత స్టేషన్స్ స్కీం కింద అనేక రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
హైదరాబాద్ నగరంలో రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి ఇక హైదరాబాద్ నగరంలో కూడా ఆరు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని సంకల్పించిన రైల్వే వీటి అభివృద్ధి కోసం 170. 61 కోట్ల రూపాయలను కేటాయించిన విషయం తెలిసిందే.ఇప్పటికే బేగంపేట రైల్వే స్టేషన్ అత్యాధునికంగా పునరుద్ధరణ జరుపుకొని ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ గా బేగంపేట రైల్వే స్టేషన్ ను ప్రారంభించారు.

**హైదరాబాద్ లో ఐదు రైల్వే స్టేషన్‌ల ఆధునీకరణ పనులు...**
ఇక ఇప్పుడు ప్రస్తుతం హఫీజ్ పేట, హైటెక్ సిటీ, మలక్పేట, మల్కాజ్గిరి, ఉప్పుగూడ రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. ఈ రైల్వే స్టేషన్ లో పునరుద్ధరణ పనులు పూర్తయి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి, ఇప్పటికి దాదాపు 75శాతం నుంచి 80 శాతం పనులు పూర్తి కాగా, ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి పనులు మొత్తం పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రయత్నం చేస్తున్నారు


**త్వరలోనే ఈ రైల్వే స్టేషన్ల పనులు పూర్తి**
హఫీజ్ పేట, హైటెక్ సిటీ, మలక్పేట స్టేషన్లలో ఇంకా 25 శాతం పనులు పెండింగ్లో ఉన్నాయి. ఈ పనులను మరో 5 నెలల్లో పూర్తి చేసి రైల్వే స్టేషన్లను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.
మల్కాజ్గిరి రైల్వేస్టేషన్లో దాదాపు 82 శాతం పనులు పూర్తి కాగా, ప్రస్తుతం ప్లాట్ఫారం నెంబర్ వన్, ప్లాట్ఫారం నెంబర్ టు వైపు షెల్టర్ ల పనులు వేగంగా జరుగుతున్నాయి.

**డిసెంబర్ నాటికి అన్ని రైల్వే స్టేషన్ల పనులు పూర్తి**
మరో నాలుగు నెలలలో పూర్తి పనులు కంప్లీట్ అవుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇక ఉప్పుగూడా రైల్వే స్టేషన్లో 70 శాతం పనులు ఇప్పటికి పూర్తయ్యాయి. మరో అయిదు నెలల్లో పనులు పూర్తి చేయాలని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. డిసెంబర్ నాటికి అన్ని పనులు పూర్తి చేసే లక్ష్యంతో పని చేస్తున్నారు. ఏది ఏమైనా ఒక హైదరాబాద్ నగరంలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా 2750 కోట్ల రూపాయలతో 40 స్టేషన్లను అభివృద్ధి చేస్తోంది ఇండియన్ రైల్వే.

# సృష్టి కేసులో వెలుగులోకి సంచలన విషయాలు

(మొదటి పేజీ తరువాయి)
టెస్ట్ ట్యూబ్ బేబీ (ఐవీఎఫ్) పద్ధతి జరగలేదని.. బయట వేరొకరికి పుట్టిన బిడ్డలను తీసుకొచ్చి, సంతానం లేని దంపతులకు అద్దె గర్భం ద్వారా పుట్టారని నమ్మించి ఇచ్చినట్లు పోలీసులు తేల్చారు. ఈ దారుణ మోసం ద్వారా డాక్టర్ నమ్రత దంపతుల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసినట్లు వెల్లడైంది. ఇది కేవలం వైద్య మోసం కాదని.. బిడ్డల అక్రమ రవాణా (చైల్డ్ ట్రాఫికింగ్) అని పోలీసులు పేర్కొన్నారు.

**రాజస్థాన్ జంట ఫిర్యాదుతో వెలుగులోకి..**
ఈ కేసు వివరాలను నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ మీడియాకు వెల్లడించారు. గోపాలపురంకు చెందిన ఒక జంట ఇచ్చిన ఫిర్యాదుతో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై రైడ్ చేశామని డీసీపీ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన ఒక దంపతులు ఆన్‌లైన్‌లో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ గురించి తెలుసుకుని డాక్టర్ నమ్రతను సంప్రదించారు. సరోగసి (అద్దె గర్భం) పద్ధతిలో పిల్లలు పుట్టించడానికి రూ.30 లక్షలు అవుతుందని నమ్రత వారికి చెప్పింది. దీంతో దంపతులు విజయవాడ వెళ్లి, అక్కడ తమ శాంపిల్స్ ఇచ్చారు. సరోగసి కోసం అద్దె గర్భం మోసే మహిళ దొరికిందని డాక్టర్ వారికి నమ్మబలికింది.
కొన్ని నెలల తర్వాత బాబు పుట్టాడని ఆ జంటకు డాక్టర్ నమ్రత చెప్పింది. సిజేరియన్ ద్వారా డెలివరీ అయిందని అబద్ధం చెప్పి.. అదనంగా మరో రూ.10 లక్షలు వసూలు చేసింది. దీంతో మొత్తం రూ.40 లక్షలు దంపతుల నుంచి



లాగేసింది. అయితే.. కొన్ని నెలల తర్వాత ఆ బాబు పోలికలు ఆ దంపతులకు అనుమానాస్పదంగా అనిపించాయి. దీంతో వారు డీఎన్ఏ టెస్ట్ చేయాలని డాక్టర్‌ను కోరారు. ఇందుకు నమ్రత అస్సలు ఒప్పుకోలేదు. దాంతో దంపతులు ఢిల్లీలో డీఎన్ఏ టెస్ట్ చేయించారు. ఆ పరీక్షలో ఆ బిడ్డ తమకు చెందినది కాదని.. మరొకరి డీఎన్ఏగా తేలడంతో దంపతులు డాక్టర్ నమ్రతను నిలదీశారు. అయితే.. నమ్రత తన కొడుకు జయంత్ కృష్ణతో కలిసి బాధితులను బెదిరింపులకు పాల్పడింది. జయంత్ కృష్ణ తాను న్యాయవాదినని చెప్పుకొని బెదిరించాడు.

**బిడ్డల అక్రమ రవాణా..**
డాక్టర్ నమ్రత చేసింది నిజానికి సరోగసి కాదు. వేరే మహిళకు పుట్టిన బిడ్డను తీసుకొచ్చి, సరోగసి ద్వారా మీకు పుట్టిన బిడ్డ అని దంపతులను నమ్మించింది. ఢిల్లీకి చెందిన ఒక గర్భిణిని ఫ్లైట్‌లో వైజాగ్ తీసుకొచ్చి, అక్కడ డెలివరీ చేసి, ఆమెకు పుట్టిన బిడ్డను ఆ రాజస్థాన్ దంపతులకు ఇచ్చింది. బిడ్డను వద్దనుకున్న ఆ మహిళకు రూ.90 వేలు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు.
సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌కు సరైన అనుమతులు లేవని, ఆ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు 2021లోనే గడువు తీరిందని డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. హైదరాబాద్ DM & HO వెంకట్ కూడా ఈ రైడ్‌లో పాలుపం చుకుని.. 2020లోనే వారి అనుమతులు ముగిశాయని, ఆసుపత్రి మూసేస్తున్నామని వారు చెప్పారని.. క్లోజింగ్ సర్టిఫికెట్ కూడా ఇచ్చామని చెప్పారు. అయినా అక్రమంగా టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను నడుపుతున్నారని ఆయన అన్నారు. సెంటర్‌లో థియేటర్, అనస్థీషియా ల్యాబ్, బెడ్స్, 7 రకాల అనాలసిస్ చేసే ఎక్విప్‌మెంట్ ఉన్నాయని, డస్ట్ బిన్ చెక్ చేస్తే రెగ్యులర్ ప్రాసెస్ చేస్తున్నట్లు ఆధారాలు సేకరించామని పోలీసులు తెలిపారు. డాక్టర్ నమ్రతపై రెండు రాష్ట్రాల్లో 10కి పైగా కేసులు ఉన్నాయని, ఐవీఎఫ్ ఫెయిల్యూర్, సరోగసిలో అక్రమాలు వంటి కేసులు ఉన్నాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ కేసులో ఇంకా చాలా మందికి పాత్ర ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, ఏడుగురిని రిమాండ్‌కు తరలించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం
29.07.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## కరెంట్ షాక్‌తో మహిళ మృతి



**రాజేంద్రనగర్, విశాలభారతి:**
ఓ మహిళ కరెంట్ షాక్ తగలడంతో మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రబోడలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం.. స్థానికంగా నివాసముండే బల్లి లావణ్య(35) ఉదయం తన ఇంట్లో ఫ్రిడ్జ్ ఓపెన్ చేస్తుండగా విద్యుదాఘాతమైంది. లావణ్య కూతురు తల్లిని రక్షించే క్రమంలో కరెంట్ షాక్ తగిలింది. అపస్మారక స్థితికి చేరుకున్న లావణ్యను వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అయితే లావణ్య భర్త నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కల్ బర్డ్ సింగిల్ విండో సదుపాయాన్ని ప్రారంభించిన తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**
తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ ఆదివారం నాడు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని పెద్ద అంబర్పేట్ వద్ద కల్ బార్డ్ సింగిల్ విండో -5 రీజియన్స్ భవనాన్ని అధికారికంగా ప్రారంభించింది, ఈ కొత్త సదుపాయం తెలంగాణ రాష్ట్ర పరిసర పౌల్ట్రీ రంగానికి మౌలిక సదుపాయాలు ఆపరేషన్ సామర్థ్యం పెంపు దిశగా ఎంతో ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది, ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ నల్లగొండ మాజీ ఏపీ ఎఫ్ ఎఫ్ అధ్యక్షులు కాసిరెడ్డి నారాయణరెడ్డి లు పాల్గొని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా టీపీఎఫ్ అధ్యక్షులు కాసర్ల మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ భవనం కేవలం ఒక మౌలిక సదుపాయమే కాదు ఇది ఏకత్వానికి అభివృద్ధికి మా ఫెడరేషన్ పౌల్ట్రీ రైతులను శక్తివంతం చేయాలన్న అంకిత భావానికి ప్రతీక అని అన్నారు, ఇది కల్ బర్డ్ మార్కెటింగ్ కు కేంద్ర బిందువుగా మారి పారదర్శకత సమర్థత కలిగిన సేవలను అందించడంలో సహాయపడుతుందని తెలిపారు, ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ పౌల్ట్రీ పారిశ్రామ పితామహుడు బివి రావు చేసిన సేవలు మరువలేనివి అని పౌల్ట్రీ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.
వైయస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో అన్ని విధాలుగా పౌల్ట్రీ రంగాన్ని ఆదుకున్నారు అలాగే ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి పౌల్ట్రీ రైతుల సమస్యలు విద్యుత్ సబ్సిడీ హెచ్ఎండిఏ పరిధిలో పౌల్ట్రీ రైతులు నిర్మించే షెడ్ పర్మిషన్ విషయాలలో ముఖ్యమంత్రి కి వివరించి వాటిని తీర్చే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పి పి ఎఫ్ ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్ రావు, మాజీ అధ్యక్షులు ఏపీ ఎఫ్ ఎఫ్ దాలే సుధాకర్, ఎన్ ఈ సి సి హైదరాబాద్ జోన్ చైర్మన్ గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఉప్పల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఊడుతల భాస్కరరావు, జాయింట్ సెక్రటరీ పాతూరి వెంకట్రావు, ట్రెజరర్ వంగేటి అభిషేక్ రెడ్డి, కాల్ బర్డ్ సింగిల్ విండో హైదరాబాద్ -5 రిజియన్స్ జక్క రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ కల్లు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- కల్తీ కల్లు బాధితులను పరామర్శించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిందం శ్రీకాంత్



**శేరిలింగంపల్లి, విశాలభారతి:**
గత నెల కూకట్ పల్లి లో కల్తీ కల్లు సేవించి 12 మంది పైగా ప్రాణాలు కోల్పోయిన సంఘటన సంచలనం సృష్టించింది. 50 మందికి పైగా ప్రాణాపాయ స్థితిలో క్రియాటిన్ లెవెల్స్ పెరిగి కిడ్నీలు పాడై నిమ్స్,గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే హైదర్ నగర్ డివిజన్ కు చెందిన కల్తీకల్లు బాధితురాలు అంగన్వాడీ స్కూల్లో ఆయాగా పనిచేస్తున్న ప్రమీల కిమ్స్ లో చికిత్స పొందుతుంది. కాగా క్రియాటిన్ లెవెల్స్ కంట్రోల్ కావకపోవడంతో చికిత్స నిమిత్తం నిమ్స్ నుంచి గాంధీ హాస్పిటల్ కి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీలనీ హైదర్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది సిందం శ్రీకాంత్ గాంధీ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కల్తీ కల్లు సేవించి అస్వస్థకు గురైన బాధితులని ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్న డాక్టర్లతో మాట్లాడి ప్రమీల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రమీల నెమ్మది నెమ్మదిగా కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు అన్నారు. త్వరలో సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి వస్తారని ఆశ బాగా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ కల్లు ఘటన సంచలనం సృష్టించిన రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే,డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ కనీసం బాధితులని పరామర్శించి ఆదుకున్న పాపాన పోలేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో నర్సింగ్ రావు, రాము, మహమ్మద్ రషీద్, విష్ణు, షకీల్ పాల్గొన్నారు.

## జైపాల్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించిన మధుయాష్కీ గౌడ్



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**
కేంద్ర మాజీ మంత్రివర్యులు, స్వర్గీయ జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులో స్ఫూర్తి స్థల్ లోని వారి ఘాట్ వద్ద టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ హాజరై నివాళులర్పించారు. జైపాల్ రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ కలిసిన జైపాల్ రెడ్డి సతీమణి లక్ష్మీ , సోదరుడు పద్మా రెడ్డి ని, సీఎం రేవంత్ రెడ్డి సతీమణి గీత లను పలకరించారు. తనకు విద్యార్థి దశ నుంచి జైపాల్ రెడ్డితో అనుబంధం ఉందని, అమెరికా లో ఉన్నప్పుడు తిరిగి భారతదేశానికి రావాలి అని, రాజకీయాల్లో పాల్గొనాలని తనను ప్రోత్సహించారని మధుయాష్కీ పేర్కొన్నారు. జైపాల్ రెడ్డితో కలిసి పార్లమెంటులో పనిచేయడం, వారితో అనుబంధం, మరువలేనిదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, తెలంగాణ ఏర్పాటు కోసం వారితో మమేకమై పని చేసిన తిరుమరువలేని దన్నారు. విలువలు, నిబద్ధతతో కూడిన రాజకీయ నేతగా జైపాల్ రెడ్డి అందరికీ ఆదర్శవంతుడని,భవిష్యత్ తరాలకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి కార్యదర్శి గజ్జి భాస్కర్, హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నగౌని రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# శేరిలింగంపల్లి అభివృద్ధే లక్ష్యం

## టిపీసీసీ జనరల్ సెక్రటరీ జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి, విశాలభారతి: శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక నియోజకవర్గ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖడే తో కలిసి చర్చించారు. ఈ మేరకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ గౌడ్, కిరణ్, సంగమేష్, ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.



## పలారం బండి ఊరేగింపులో పాల్గొన్న ఉప్పల

**ఎల్ బి నగర్, విశాలభారతి:**
బోనాల పండుగ సందర్భంగా నాగోల్, సరూర్ నగర్ లో జరిగిన పలారం బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆ అమ్మవార్ల ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ,లోకేష్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వేలన్నీ బిఆర్ఎస్ వైపే

**కొడకండ్ల, విశాలభారతి:**
మండల బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ సిందే రామోజీ అధ్యక్షతన కొడకండ్ల మండల ఇంచార్జీ బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ 01,ఎంపీటీసీ 02 క్లస్టర్ల వారిగా సన్నాహక సమావేశం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బోగస్ 420 హామీల వల్ల ప్రజలు మోసపోయారని,తెలంగాణ లో ఒక పెద్ద బ్లాక్మెయిలర్ చేతిలో ప్రభుత్వం నడవటం చాలా బాధాకరమైన విషయమని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అరిగోసలు పడుతున్నారని, రాష్ట్రంలో మొత్తం రాక్షస పాలన కొనసాగుతుందని,సరైన పాలన లేదని,కేసిఆర్ గారి దూరదృష్టితో రైతులు సుభిక్షంగా ఉన్నారని,స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వేలన్నీ బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నాయని అన్నారు.



## క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

**వాజేడు, విశాలభారతి:**
వాజేడు మండలం గుమ్మడిదొడ్డి పంచాయతీ పరిధి ఇప్పగూడెం గ్రామనికి చెందిన మోడెం వంశీ పవర్ లిఫ్టింగ్ లొ ఇండియా తరుపున నార్త్ అమెరికా కి సెలక్ట్ కావడం జరిగింది. నార్త్ అమెరికా వెళ్ళుటకు సుమారు 4 లక్షలు ఖర్చు అవుతుంది నిరుపేద కుటుంబం ఆర్థిక స్తోమత లేక బీఆర్ ఎస్ నాయకులు నూ సహాయం అడుగగా ములుగు జిల్లాపార్టీ అధ్యక్షులు కాకలమర్రి లక్ష్మీనరసింహారావు 25000 వేల రూపాయలు, మాజీ నూగురు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య 50000 వేల రూపాయలు, మొత్తం 75000 వేలు రూపాయల నూ ఆర్థిక సహాయం అందించినారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ వాజేడు మండల అధ్యక్షులు పెనుమల్లు రామకృష్ణ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు మోడిగ తిరుపతి యాదవ్, చెన్నంసాంబశివరావు,నాయకులు మొడెం ప్రకాష్ మోడెం నాగరాజు యూత్ నాయకులు బోదేబోయిన మనోవికాస్ వేములవాడ వేణు పరిశిక రామకృష్ణ .కిరణ, పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాలభారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం
29.07.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com





# సమీక్ష సమావేశం నిర్వహించిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సిరెడ్డి

**జనగామ, విశాలభారతి:**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సిరెడ్డి పాలకుర్తి మండలకేంద్రంలో ముఖ్య సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశానికి కొడకండ్ల మండలానికి చెందిన ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సమీక్ష సమావేశం ప్రధానంగా రాబోయే స్థానిక ఎన్నికల దృష్ట్యా గ్రామస్థాయిలో పార్టీ పరిస్థితులపై, బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణంపై, యువజన సంఘటనా విధానాలపై మరియు పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్లే వ్యూహాలపై దృష్టి సారించింది. ఈ సందర్భంగా ఝాన్సిరెడ్డి మాట్లాడుతూ గ్రామాలు, మండలాల స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలపడాలని, ప్రతి నాయకుడు తన గ్రామంలో పార్టీ జెండాను గర్వంగా ఎగురవేయాలని, యువత కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను భుజాలపై వేసుకోవాలని, మీ గ్రామాలలోని సమస్యలను మీరే గుర్తించి, ప్రజలతో మమేకమై ఉండాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించా లని, ప్రత్యేకించి యువత రాజకీయంగా చురుకు గా ఉండాలని, యువజన కాంగ్రెస్ శాఖ కార్యకలా పాలను కొనసాగించాలని, గ్రామస్థాయి లో తక్షణ కార్యాచరణకు పునాది వేయాలని సూచించారు.

# మహిళ అదృశ్యం



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**
హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి లక్ష్మారెడ్డి పాలెం పెద్ద అంబర్పేట్ కు చెందిన ఇరుగు మౌనిక భర్త రాజు (25) తో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడం వల్ల గత రెండు సంవత్సరాల నుండి ఇరుగు మౌనిక తన తల్లి అయిన ఫత్తేపురం మీనమ్మ దగ్గర లక్ష్మారెడ్డి పాలెం నందు ఉంటున్నట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడం వల్ల గత రెండు సంవత్సరాల నుండి ఇరుగు మౌనిక తన తల్లి అయిన పత్తేపురం మీనమ్మ దగ్గర లక్ష్మారెడ్డి పాలెం నందు ఉంటున్నట్లు ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో బయటకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయలుదేరిన ఇరుగు మౌనిక ఇప్పటివరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో పత్తేపురం మీనమ్మ తన కూతురు గురించి చుట్టుపక్కల ప్రాంతాల్లో బంధువుల వద్ద ఎంత వెతికిన ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో ఇరుగు మౌనిక ఫోన్ స్విచ్ ఆఫ్ అని వస్తుండడంతో తన తల్లి మినమ్మ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# శ్రావణ మాసంలో కళ్యాణ వైభోగమే..!

(మొదటి పేజీ తరువాయి)
పెళ్లిళ్లు లేవు. దీంతో కళ్యాణ మండపాలు, వాటి మీద ఆధారపడిన అనేక మంది జీవితాలు వెలవెల పోయాయి. ఇక వస్త్ర దుకాణాల లోను, జువెలరీ షాప్ లలోను పెద్దగా కొనుగోలు చేసిన దాఖలాలు కనిపించలేదు. మళ్లీ ఇప్పుడు శ్రావణమాసం ప్రారంభం కావడంతో తెలుగు రాష్ట్రాలలో సందడి మొదలైంది.

**ఈసారి ముహూర్తాలిలా...**
పెళ్లిళ్లు, శుభకార్యాలలో ప్రజలు నిమగ్నం అయిపోయారు. షాపింగ్ కూడా కళకళ లాడుతుంది ఈనెల 26వ తేదీ నుంచి వివాహాలకు మంచి ముహూర్తాలు ప్రారంభం కావడంతో అందరూ పెళ్లిళ్ల హడావిడిలో పడిపోయారుఈనెల 26వ తేదీ నుంచి వివాహాలకు మంచి ముహూర్తాలు ప్రారంభంఉన్నాయి. ఆగస్టు 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు చాలా బలమైన ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు.

**నవంబర్ నెల వరకు మంచి ముహూర్తాలు...**
ఇక సెప్టెంబర్ చివరి వారంలో కూడా శుభముహూర్తాలు ఉన్నాయని, అక్టోబర్ నెలలో మూడవ వారం మినహాయించి మిగిలిన అన్ని రోజులు అనుకూలంగా ఉన్నాయని చెబుతున్నారు. నవంబర్ నెలలో కూడా అనేక మంచి ముహూర్తాలు ఉన్నాయని ఇక పెళ్లిళ్లు చేసుకోవాలనుకునే వారు తమ జాతకాలకు తగ్గట్టుగా ఉన్న ముహూర్తాలను చూసుకొని రెడీ అయిపోతున్నారు అని చెబుతున్నారు.

**బిజీగా ఫంక్షన్ హాల్స్...**
ఈసారి మంచి ముహూర్తాలు ఎక్కువగా ఉండటం వల్ల ఫంక్షన్ హాల్స్ ఇప్పటికే బిజీ అయిపోయాయి.



ఇప్పటికే చాలామంది మంచి మంచి ముహూర్తాలు ఉన్న తేదీలలో ఫంక్షన్ హాల్స్ ను బుక్ చేసుకున్నారు. ఇక కొందరు మంచి ముహూర్తాలు ఉన్న తేదీలలో తమకు అనుకూలమైన కళ్యాణ మండపాలు ఫంక్షన్ హాల్స్ దొరకకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు..

**ఈ సీజన్ లో వీరందరికీ ఉపాధి...**
ఇక పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే పెళ్లి చేయడానికి వచ్చే పురోహితుల దగ్గర నుండి, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, వంట మనుషులు, డెకరేషన్ చేసేవారు, టెంట్ హౌస్ సామాను ఇచ్చేవారు, ఫంక్షన్ హాల్స్ లో శానిటేషన్ చూసేవారు, ఆర్కెస్ట్రా కళాకారులు, సన్నాయి మేళం వారు, బ్యాండ్ వాళ్ళు ఇలా ఒకరేమిటి ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. ఇక ఈ సీజన్లో నవంబర్ వరకు పెళ్లిళ్లు ఉండడంతో వీరందరికీ ఉపాధి దొరుకుతుందని భావిస్తున్నారు.

**శ్రావణ మాస కళ్యాణ వైభోగం.. వీరి జీవితాల్లో వసంతం...**
ఈసారి లక్షల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నట్లు ఒక అంచనా. ఇక పెళ్లిళ్ల సీజన్లో నగల దుకాణాలు, వస్త్ర వ్యాపారులు కూడా చాలా బిజీ అయిపోతారు. ఏది ఏమైనా శ్రావణమాస కళ్యాణ వైభోగం ఎంతోమంది జీవితాలకు ఉపాధి నిస్తుందని, వెలుగులు నింపుతుందని చెప్పక తప్పదు.



# ప్రాథమిక పాఠశాల టై, బెల్ట్ పంపిణీ

## మా పాఠశాలను మేమే అభివృద్ధి చేసుకుంటాం పాలడుగు ప్రవీణ్

**దేవరుప్పుల, విశాలభారతి:**
మండలం సింగరాజుపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల హరిజన కాలనీలో విద్యార్థినీ విద్యార్థులకు టై, బెల్టులు, దాత పాలడుగు ప్రవీణ్ సహాయ సహకారాలతో పంపిణీ చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గౌరవ మండల విద్యాధికారి శ్రీమతి జి.కళావతి విచ్చేసి ప్రభుత్వ పాఠశాల లను స్థానికంగా ఉండే మనమే కాపాడుకోవాలని ఈ రకంగా స్థానికులు సహాయ సహకారాన్ని ఉంటే మనబడి ప్రైవేట్ స్కూళ్ల కంటే ఎక్కువ మెరుగుపరచుకొని విద్యాబోధన మెరుగుతో పిల్లల భవితకు తోడ్పడుతామని అన్నారు. టై, బెల్ట్ దాత అయిన పాలడుగు ప్రవీణ్ కుమార్ అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజయ్య బాస్కుల గారు విద్యార్థుల తల్లిదండ్రులను గౌరవంగా శాలువా తో ఘనంగా సన్మానించారు. దాతలు పాలడుగు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మా గ్రామ పాఠశాలలో మా పిల్లలను చదివించి వారి భవితకు తోడ్పడేలా మా పాఠశాలను మేమే మెరుగుపరచుకుంటామని, పాఠశాల కు ప్రొజెక్టర్ ను త్వరలో అందజేస్తానని, తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజయ్య, అంగన్వాడీ టీచర్ శ్రీలత, ప్రవీణ్ నవనీత ,శ్రీలత, రమ్య, రొడ్డ రేణుక, గోపాల్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



# తొట్టేలా ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**
హయత్ నగర్ గ్రామం లో బోనాల పండగ సందర్భంగా పాత గ్రామం శ్రీ చక్రసహిత మహమ్మాయి రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, ఈ యొక్క కార్యక్రమం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, బీజేపీ సీనియర్ నాయకులు సంఘీ అశోక్, జనార్ధన్, అరుణ్, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- ఎండి, ఎన్ బలరామ్
- ఇప్పటి వరకు ఆయన నాటిన మొక్కలు 19,775

**మణుగూరు, విశాలభారతి:**
సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండి ఎన్ బలరామ్ సోమవారం నాడు కొత్తగూడెం బంగ్లోస్ ఏరియాలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా 204మొక్కలను స్వయంగా నాటారు. బలరాం 2019 జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు 108 మొక్కలు నాటి అప్పటినుండి తాను ఒక్కరే సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో మొక్కలు నాటుతూ వస్తున్నారు. సోమవారం నాడు నాటిన మొక్కలతో కలిపి ఆయన ఇప్పటివరకు 19775 మొక్కలను నాటడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మొక్కలు నాటే కార్యక్రమంలో కార్మికులను ఉద్యోగులను వారి కుటుంబ సభ్యులను కూడా భాగస్వామ్యులను చేయాలని పర్యావరణ పట్ల గల అభిమానంతోనే తాను మొక్కలు నాటుతూ వస్తున్నానని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ సంస్థల బాధ్యతగా భావించకూడదని ప్రతి ఒక్కరు తగువంతుగా కనీసం మూడు మొక్కలు నాటాలన్నారు. పండ్ల మొక్కలను పెంచడానికి ఎవరైనా ముందుకొస్తే వాటిని సింగరేణి సంస్థ ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఈ అండ్ ఎం శ్రీ డి సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ ఎల్.వి . సూర్యనారాయణ, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ శ్రీ కే వెంకటేశ్వర్లు, జిఎం సిపిపి శ్రీ ఏ మనోహర్, జిఎం ఎన్విరాన్మెంట్ శ్రీ బి సైదులు. ఇంకా వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు శ్రీ ఎన్ రాధాకృష్ణ, ఏ రవికుమార్, శ్రీ పి ఎలీషా, శ్రీ డి శ్రీనివాసరావు, శ్రీ జీవి కిరణ్ కుమార్, శ్రీ సిహెచ్ లక్ష్మీనారాయణ, శ్రీ డి వెంకటేశ్వర్లు, శ్రీ మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# రూ. 1.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**రాజేంద్రనగర్, విశాలభారతి:**
నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ సర్కిల్-11 పరిధిలోని అత్తాపూర్ డివిజన్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ. 1.40 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా తేజస్వినగర్, లక్ష్మీ నగర్, రెడ్డి బస్తీ మరియు సిక్ చావుని ప్రాంతాలలో రూ. 91 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్, ప్యాచ్ వర్క్లకు శంకుస్థాపన చేశారు. అత్తాపూర్ డివిజన్లోని వివిధ ప్రాంతాలలో రూ. 49 లక్షల వ్యయంతో యూజీడీ (అండర్గ్రౌండ్ డ్రైనేజీ) పనులకు కూడా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల దీర్ఘకాల డిమాండ్లను నెరవేరుస్తూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయితే స్థానికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా యూజీడీ పనులు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని, వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ అభివృద్ధి పనులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, నాయకులు మొండ్ర కొమురయ్య, సీనియర్ జర్నలిస్టు మేడం మధుసూదన్, అత్తపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు సులిగే వెంకటేష్ పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**వాజేడు, విశాలభారతి:**
ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని ఏడు జర్ల పల్లి గ్రామానికి చెంది ఎక్కే బోయిన శేషమ్మ అనారోగ్యానికి గురై వరంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఇటీవల మృతి చెందడం జరిగింది. బాధిత కుటుంబానికి వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దాన సంస్కరణ నిమిత్తం 7000 రూపాయలు ఆమె కుమార్తె అయిన స్వప్నకు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకినబోయిన నరసింహారావు చెన్నం మోహన్ రావు,ఎర్రకట్ల సుమన్,బట్టు బాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# కానిస్టేబుళ్లు టెక్నాలజీపై పట్టు సాధించాలి

**కరీంనగర్ క్రైం, విశాలభారతి:**
కానిస్టేబుళ్లకు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి టెక్నాలజీపై పట్టు సాధించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. పోలీస్ కమీషనరేట్ పరిధిలో కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు టెక్నాలజీ వినియోగంపై దశలవారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో బ్యాచ్ శిక్షణను సీపీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ కేంద్రంలోని ఐటీ కోర్ కార్యాలయంలో పోలీసులు ఉపయోగించే వివిధ సాఫ్ట్వేర్లు, అప్లికేషన్లు, సాంకేతిక పరిజ్ఞానంపై ఈ శిక్షణ ఉంటుందని వివరించారు. నేరాల ఛేదనలో సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు జి విజయ కుమార్, వేణుగోపాల్, సీఐ తిరుపతి పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత మనందరిది

## టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీరెడ్డి

**దేవరుప్పుల, విశాలభారతి:**
మండలం,చిన్నమాడురు గ్రామంలో నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ సమావేశంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,మహిళా నాయకురాళ్లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి సమస్యలపై చర్చించడంతో పాటు,రాబోయే ఎన్నికల వ్యూహంపై ఈ సమావేశంలో దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా ఝాన్సిరెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వాసంతో ఉన్నారని, చిన్నమాడురు, రంభోజి గూడెం గ్రామాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ఈ రెండు గ్రామాలలో కాంగ్రెస్ జెండా ఎగరాలని, గతంలో మోసపోయిన ప్రజలు ఈసారి తెలివిగా నిర్ణయం తీసుకోవాలని,కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే పేదల భద్రత, రైతులకు న్యాయం,



యువతకు ఉపాధి వంటి అంశాలు సాధ్యమవుతాయని,స్థానిక సమస్యలు, సంక్షేమ పథకాలు, యువత భాగస్వామ్యం, మహిళల అభివృద్ధిపై పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.
గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని,రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత మనందరిదని ప్రజలను ఉద్దేశించి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ,మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్ నాయక్,మండల ఎస్సీ,ఎస్టీ, బిసి,మైనారిటీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు, భూక్యా సజ్జన్,కాడబోయిన గణేష్,మహ్మద్ రసూల్ ఎన్ ఎస్ యుఐ అధ్యక్షుడు కొంగరి ఉమేష్,మండల నాయకులు రెడ్డి రాజుల రమేశ్, ఓడపల్లి రవి,అందే యాకయ్య,రాంచందర్ నాయక్, లీనా రెడ్డి,తదితర నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.